


# Dr.PRK పవర్

పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప




సంపుటి : 01 సంచిక : 351 | మంగళవారం 29 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 4

# తెలంగాణ అభివృద్ధికి ప్రధాని సహకరించడం లేదు

**మెట్రో రైల్, ట్రిబుల్ ఆర్ విస్తరణకు అడ్డుపడుతున్న కేంద్రం**

**ఎన్నికల కమిషన్ ను...లాలా సైమన్ కమిషన్ లా వాడుతున్న బిజెపి**

**తెలంగాణ ప్రయోజనాల కోసమే ఢిల్లీ పర్యటనలు.. నేడు కేంద్ర మంత్రులతో కలవనున్న సీఎం రేవంత్**

**ప్రతిదిన్ మీడియా నెట్వర్క్ 'ది కాంక్లేవ్ 2026'లో సీఎం రేవంత్ రెడ్డి**

న్యూఢిల్లీ, పవర్ న్యూస్

తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీ సహకరించడం లేదని, ఆర్ఆర్ఆర్‌కు టెండర్ల సమయానికి కేంద్రం అనుమతులను అడ్డుకుందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ప్రతిదిన్ మీడియా నెట్వర్క్ 'ది కాంక్లేవ్ 2026'లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నార్త్ వర్సెస్ సౌత్ కాదు, గుజరాత్ వర్సెస్ దేశం అన్నట్లుగా ఉందని విమర్శించారు. యూపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మోదీ నిధులు గుజరాత్‌కు మళ్లిస్తున్నారని ఆరోపించారు. డీలిమిటేషన్‌లో జనాభా మేరకు సీట్లు పెంచితే పెద్ద రాష్ట్రాలకు మేలని చిన్న రాష్ట్రాలకు నష్టమని తెలిపారు. తాము పేదల వైపు ఉంటే బీజేపీ సంపన్నుల వైపు ఉందని పేర్కొన్నారు. పేదల ఓటు హక్కు తొలగించడానికే ఎస్ఐఆర్ తీసుకొచ్చారని, 2029 ఎన్నికల కోసం దేశంలో 13 కోట్ల ఓట్లు తొలగించారని రేవంత్ ఆరోపించారు. బ్రిటిషర్లు సైమన్ కమిషన్ తెచ్చినట్లు ఈసీని మోదీ వాడుకుంటున్నారని ఆక్షేపించారు. దేశంలో జనాభా తగ్గకుండా ఓట్లు మాత్రమే ఎలా తగ్గుతాయని ప్రశ్నించారు. తనకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లు తొలగించాలని మోదీ ప్రయత్నిస్తున్నారని, దేశంలో 20 కోట్ల ఓట్లు తొలగించాలని చూస్తున్నారని వెల్లడించారు. మొత్తం అధికారాలను ఢిల్లీలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు ఇచ్చారని అన్నారు. మరి బీఎల్ఏలు,




బీఎల్‌వోలు, కలెక్టర్లు ఎందుకని నిలదీశారు. ఎస్ఐఆర్ గోబ్యాక్ అని నినదిస్తూ దేశమంతా ఏకం కావాలని రేవంత్ రెడ్డి దేశంలో ప్రజల సంఖ్య పెరుగుతుంటే, ఓటర్ల సంఖ్య తగ్గుతుంది : ప్రధాని మోడీ మాయాజాలంపిలుపునిచ్చారు.

**బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదు**

తెలంగాణలో విద్యార్థి సంఘాలు చాలా తక్కువని, లెఫ్ట్, రైట్ సంఘాలున్నాయని సీఎం తెలిపారు. ఎన్ఎస్ఐయూ ప్రభావం పెద్దగా లేదని, ఉత్తర భారతదేశంలో, దక్షిణ భారతదేశంలో రాజకీయాల శైలి వేరని, మా దగ్గర యూనివర్సిటీ లా కాలేజ్, ఆర్ట్స్ కాలేజీ నాయకునిగా ఏబీవీపీలో గెలిచిన వారు తర్వాత కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని గుర్తు చేశారు. యూనివర్సిటీలో విద్యార్థి సంఘంలో ఉన్నా, గ్రామానికి వెళ్లిన తర్వాత ఆ కుటుంబం కాంగ్రెస్‌లోనే ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదని పేర్కొన్నారు. స్టూడెంట్ రాజకీయాల్లో ఏబీవీపీ ప్రభావం ఉంటే రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రభావం ఉంటుందని వెల్లడించారు. "రాష్ట్ర విభజన తర్వాత నాయకత్వం ఆంధ్రప్రదేశ్‌లో ఉండడంతో తెలుగుదేశం పార్టీకి తెలంగాణలో ప్రాధాన్యం తగ్గిపోయింది. మీరు మంచి నాయకుడు, మీరు చంద్రబాబు నాయుడుతో కలిసి పని చేస్తే తెలంగాణలో ఇబ్బంది అని ప్రజలు చెప్పారు. దాంతో నేను కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నాను. తెలుగుదేశం కేంద్రంలో ఎన్డీఏతో ఉంది. ఏపీలో ఎన్డీఏ ఉంది. తెలంగాణలో బీఆర్ఎస్, ప్రభుత్వం ఉంది. నేను రెండింటితో పోరాడాల్సి ఉంది. రాహుల్ గాంధీ, దిగ్విజయ్ సింగ్, జైరాం రమేశ్ తో పాటు నా శ్రేయోభిలాషులు కాంగ్రెస్‌లో ఉన్నారు. రాష్ట్రంలో 2014 ఎన్నికల తర్వాత పోటీ కేసీఆర్, రేవంత్ మధ్య పోటీగా మారింది. ఆయన నన్ను అనేక సార్లు జైలుకు పంపారు. నేను అసెంబ్లీకి కన్నా జైలుకే ఎక్కువ సార్లు పోయా. , రాహుల్ గాంధీని కలిసిన తర్వాత 15 నిమిషాలు మాట్లాడాం. ఆ రోజే ఆయన నా నాయకుడని నిర్ణయించుకున్నా. రాహుల్ గాంధీకి ఎటువంటి వ్యక్తిగత అజెండాలు లేవు. ఆయనకు దేశమే ముఖ్యం. నేను విద్యార్థి సంఘంలో ఉన్నా. చంద్రబాబు నాయుడు పార్టీలో ఉన్నా దేశం, రాష్ట్రం కోసం ఏదైనా చేయాలనుకున్నా అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.




## భూ సమస్యల శాశ్వత పరిష్కారమే రీసర్వే ప్రక్రియ లక్ష్యం

**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**రెవెన్యూ, భూ రీసర్వే, ఇందిరమ్మ ఇండ్లు, తదితర అంశాలపై ఉమ్మడి జిల్లా స్థాయిలో సమీక్ష సమావేశం.**

హైదరాబాద్, పవర్ న్యూస్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియ భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపే మార్గమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి ఐడీఓసీ సమావేశ మందిరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని రెవెన్యూ, గృహ నిర్మాణం, భూముల సర్వే, తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తన సహచర మంత్రులైన ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి హాజరై సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉమ్మడి జిల్లాలోని మండలాల వారీగా భూముల రీ సర్వే ప్రక్రియపై తహసిల్దార్లు, సర్వేయర్లతో ఒక్కొక్కరిగా సమీక్షించి, పురోగతిపై ఆరా తీశారు. అదేవిధంగా సర్వే ప్రక్రియపై రైతుల నుంచి వ్యక్తమవుతున్న అనుభవాలపై ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... దాదాపు 120 ఏళ్ల క్రితం భూముల సర్వే నిర్వహించారని, మళ్లీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో సమగ్ర రీసర్వే ప్రక్రియను చేపట్టిందని తెలిపారు. ఈ ప్రక్రియను అధికారులు అత్యంత ప్రాధాన్యతతో, పారదర్శకంగా, పూర్తి బాధ్యతతో నిర్వహించాలని ఆదేశించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ భూముల రీసర్వే ద్వారా భూముల హద్దులు, యాజమాన్యానికి సంబంధించిన సమస్యలతో పాటు సాదా బైనామా ..మిగతా 2లో

## టీజీపీఎస్సీ ఉద్యోగ పరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 28

తెలంగాణలోని నిరుద్యోగులకు కీలక సమాచారం. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) పరీక్షల షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేసింది. ఈ పరీక్షలన్నీ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది. లక్షలాది మంది అభ్యర్థులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పలు కీలక పోస్టులకు సంబంధించిన పరీక్షల తేదీలను టీజీపీఎస్సీ ప్రకటించింది. విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) పరిధిలోని అసిస్టెంట్ సైంటిస్ట్ పోస్టులకు అక్టోబర్ 24న, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులకు అక్టోబర్ 26న పరీక్షలు నిర్వహించనున్నారు. అదేవిధంగా, ఆర్ అండ్ బీ శాఖలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పోస్టులకు నవంబర్ 6, 7 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. పాఠశాల విద్యాశాఖకు చెందిన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ (డీఈవో), గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్-1 పోస్టుల భర్తీకి నవంబర్ 12, 13 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయని టీజీపీఎస్సీ వెల్లడించింది. ఈ షెడ్యూల్ విడుదలవడంతో అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను వేగవంతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

## ఓటుకు నోటు కేసు: సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

**రూ. 50 లక్షల ఈడీ అటాచ్‌మెంట్‌ను రద్దు చేసిన అప్పిలేట్ ట్రైబ్యునల్**

హైదరాబాద్, పవర్ న్యూస్



2015 నాటి సంచలనాత్మక 'ఓటుకు నోటు' కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భారీ ఊరట లభించింది. ఈ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జారీ చేసిన రూ. 50 లక్షల ఆస్తుల జప్తు (అటాచ్‌మెంట్) ఉత్తర్వులను అప్పిలేట్ ట్రైబ్యునల్ రద్దు చేసింది. రేవంత్ రెడ్డితో పాటు ఈ కేసులోని ఇతర నిందితులకు కూడా అనుకూలంగా ఈ తీర్పు వెలువడింది. జస్టిస్ మునీశ్వర్ నాథ్ భండారీ నేతృత్వంలోని ధర్మాసనం ఈ నెల 14న ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కేసులో స్వాధీనం చేసుకున్న రూ. 50 లక్షల నగదును ఇప్పటికే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సీజ్ చేసి, ట్రయల్ కోర్టులో జమ చేసిందని పిటిషనర్లు తమ వాదనలు వినిపించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ట్రైబ్యునల్, వివాదాస్పద నగదు ఇప్పటికే కోర్టు అధీనంలో ఉన్నప్పుడు, దానికి సమానమైన మరో మొత్తాన్ని మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద జప్తు చేయడం చెల్లదని స్పష్టం చేసింది. నిందితులు ఆ ఆస్తులను బదిలీ చేసే అవకాశం లేనందున ఈడీ అటాచ్‌మెంట్ అవసరం లేదని ధర్మాసనం పేర్కొంది.






## ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలి

**కాంగ్రెస్ నేత డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ**

(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 28)

దేశ ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్రమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఓటర్ల జాబితాలో అక్రమ మార్పులు మరియు తొలగింపులపై సమగ్ర విచారణ జరిపించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఓటు చోరీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఏఐసీసీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియం నుంచి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ తదితరులు నిరసన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన పవిత్రమైన ఓటు హక్కును కాలరాసే కుట్రలను ప్రజలంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ పోరాటంలో ప్రతీ కార్యకర్త సైనికుడిలా భాగస్వామ్యం కావాలని కోరారు. ఎన్నికల వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న కేంద్ర తీరుపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ,




ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే ప్రజల అత్యంత కీలకమైన ఆయుధమని, దానిని హరించే ఏ ప్రయత్నాన్నైనా కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘంలోని ఇతర కమిషనర్లు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మామునూరు విమానాశ్రయం, అభివృద్ధి కార్యక్రమాలపై బీజేపీ నేతలు కేవలం ప్రెస్‌మీట్లకు పరిమితమవుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వరంగల్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, దుద్దిళ్ల శ్రీను బాబు, ఇ.వి. శ్రీనివాస్ రావు, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, డీసీసీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మార్త రవికి మ్యాజిక్ స్టార్, బెస్ట్ డీలర్ అవార్డు

**ములుగు, పవర్:**

ఆల్ పీపుల్ మెజీషియన్స్ అసోసియేషన్ నిర్వహించిన మాయాబజార్ ఖమ్మం 2 ఫెస్టివల్ లో ములుగు జిల్లావెంకటాపూర్ గ్రామానికి చెందినప్రముఖ ఇంద్రజకులు మార్త రవికి ప్రతిష్టాత్మకమైనమ్యాజిక్ స్టార్ అవార్డుతో పాటు బెస్ట్ మ్యాజిక్ డీలర్ అవార్డు కూడా దక్కింది.మ్యాజిక్ రంగంలో 30 సంవత్సరాలుగా విశిష్ట సేవలందిస్తున్న మార్త రవికి మ్యాజిక్ స్టార్ అవార్డు డాక్టర్ బోసు చేతుల మీదుగా అందించారు.ఈ అవార్డుతో పాటు 5000 రూపాయల నగదును కూడా సొంతం చేసుకున్నారు. అలాగే హైదరాబాదుకు చెందిన రఘుబాబు అందించే బెస్ట్ మ్యాజిక్ డీలర్ అవార్డు కూడా మార్త రవికి దక్కింది.ఈ అవార్డుతో పాటు మూడు వేల రూపాయల క్యాష్ ప్రైస్ కూడా గెలుచుకున్నారు కాగా ఒకే వేదికపై రెండు ప్రతిష్టాత్మకమైన అవార్డులు రావడం గమనార్హం.ఈ




సందర్భంగా మార్త రవి మాట్లాడుతూ ఒకే వేదికపై రెండు ప్రతిష్టాత్మకమైన అవార్డులు రావడం గర్వంగా వుందని ఇందుకు సహకరించిన డాక్టర్ బోసు గారికి కే వి వి కుమార్ కి కృతజ్ఞతలు తెలియజేశారు

# మృతుల కుటుంబాలను పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి



**(ఆత్మకూరు -- పవర్, సెప్టెంబర్ 28)**

ఆత్మకూరు మండలం హౌస్‌బుజుర్గ్, కటాక్షపూర్ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన బుర్ర రాజు, వల్లేపు కోమల కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మర్యాదపూర్వకంగా పరామర్శించారు.

ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని, ఎలాంటి కష్టకాలంలోనైనా తాను అండగా నిలుస్తానని చల్లా ధర్మారెడ్డి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారుల

# ఎన్నికల కమిషన్ తీరును నిరసిస్తూ పోచమ్మ మైదాన్ సెంటర్‌లో ధర్నా, రాస్తారోకో

### – పాల్గొన్న కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి

**(వరంగల్ -- పవర్, సెప్టెంబర్ 28)**

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ గారు ఓటర్ సవరణ ప్రక్రియపై తీసుకున్న నిర్ణయాలను నిరసిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశానుసారం సోమవారం రోజున పోచమ్మ మైదాన్ సెంటర్‌లో వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్ గుండు సుధారాణి, శాసనమండలి సభ్యులు, మాజీ మంత్రివర్యులు బసవరాజు సారయ్య మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొని ప్రసంగించారు. ఈ నిరసన కార్యక్రమంలో కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దగ్గం చేయడం జరిగింది. సుమారు గంటపాటు నిర్వహించిన ఈ రాస్తారోకో నిరసన కార్యక్రమం వల్ల పోచమ్మ మైదాన్ సెంటర్‌లో నాలుగు దిక్కులా ట్రాఫిక్ స్తంభించిపోయింది. అనంతరం వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ, ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పేరుతో కేంద్ర ప్రభుత్వం మరియు కేంద్ర



ఎన్నికల సంఘం ప్రజలను, ఓటర్లను అయోమయానికి గురి చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఈ ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ప్రధాన ఎన్నికల కమిషనర్ కు మిగతా ఇద్దరి కమిషనర్ల మధ్యన సమన్వయం లేకపోవడం వలన ఈ ప్రభావం ఓటర్ల తొలగింపులపై పడుతున్నదని అన్నారు. ఈ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో చాలా లోపాలు ఉన్నాయని అర్హులైన ఓటర్లను కూడా అన్యాయంగా తొలగిస్తూ, ఓటు చోరీ కి పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ అధినాయకులు రాహుల్ గాంధీ గారు ఎప్పటినుండో అంటున్నారుని గుర్తు చేశారు. వెంటనే కేంద్ర ఎన్నికల కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని గుండు సుధారాణి గారు డిమాండ్ చేశారు.

# సంగెం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పగడాల కాళీప్రసాద్ రావు



**(సంగెం, సెప్టెంబర్ 28 -- పవర్):**

మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పరకాల కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీప్రసాద్ రావు డిమాండ్ చేశారు. సోమవారం సంగెం ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించి, అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో తక్షణమే గైనకాలజిస్టును నియమించి గర్భిణులకు మెరుగైన ప్రసూతి వైద్యం అందించాలని కోరారు. రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజల ఆరోగ్య సమస్యలను ప్రాధాన్యత క్రమంలో తీర్చి, సంగెం ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం ప్రభుత్వ ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అధికార పార్టీ నాయకులు ప్రదర్శిస్తున్న పక్షపాత వైఖరిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన పేదలకు కాకుండా అధికార పార్టీ నాయకుల అనుచరులకే ఇళ్లు కేటాయించడం దారుణమని మండిపడ్డారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి మోసపూరిత హామీలతో కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని, రాబోయే రోజుల్లో ప్రజా సంక్షేమం కోసం బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సంగెం మండల పార్టీ అధ్యక్షుడు దామెరుప్పుల చంద్రమౌళి, సర్పంచ్ శేషాద్రి, బుట్టి కుమారస్వామి, ఎండి రహమతుల్లా, పైన శ్యాం, దాసరి కుమారస్వామి, నాలం చంద్రశేఖర్, రంగరాజు కృష్ణ, రమణాచారి, పండుగ రాజు, మెంతుల రాజు, ఓదెల శంకర్, రాంబాబు, దోమల రవి, సంఘసూరయ్య, గొల్లపల్లి శ్రీనివాస్, రావుల రాజేష్, ఎల్లయ్య, పాకా అశోక్, బి. నర్సయ్య, ఎల్ల గౌడ్, ఉమేందర్, అల్లం కుమారస్వామి, ఇటుకాల కరుణాకర్, మురళీధర్, వీరస్వామి, తరుణ్, రమేష్ యాదవ్, బెజ్జంకి రాజు, డి. వీరేష్, కుశ కరుణాకర్, రావుల నితీష్, నరేష్, ఆవునూరి రాజు, కీసర పైడి తదితరులు పాల్గొన్నారు.




# గూడేప్పాడ్ క్రాస్ రోడ్ వద్ద 91 కిలోల గంజాయి స్వాధీనం -- ముగ్గురి అరెస్ట్: ఆత్మకూరు సీఐ జి. బాబూలాల్

**(ఆత్మకూరు -- పవర్, సెప్టెంబర్ 28)**

ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గూడేప్పాడ్ క్రాస్ రోడ్ వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో సుమారు రూ.45.66 లక్షల విలువైన 91 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆత్మకూరు సీఐ జి. బాబూలాల్ తెలిపారు.

కేసు వివరాలు:ఆదివారం ఆత్మకూరు ఎస్సై పి. తిరుపతి తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి లభ్యమైంది.నిందితులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వెలుగూరి తాతారావు (28), కిలో గోపాల్ రావు (29), కిలో సతీబాబు (21)లుగా గుర్తించారు.వారి నుంచి గంజాయితో పాటు 2 స్మార్ట్ ఫోన్లు, 1 కీప్యాడ్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, సోమవారం పరకాల కోర్టులో రిమాండ్ చేసినట్లు ఆత్మకూరు సీఐ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై పి. తిరుపతితో పాటు కానిస్టేబుళ్లు అనిల్ కుమార్, కరణ్, శ్రీనివాస్ ప్రసాద్, హోంగార్డ్ కరుణాకర్ పాల్గొన్నారు

# రెడ్ క్రాస్ మెంబర్‌గా ముల్క ప్రసాద్.. పరకాల బీజేపీ శ్రేణుల హర్షం

### వరంగల్ జిల్లా రెడ్ క్రాస్ మెంబర్‌గా ఎన్నికైన ముల్క ప్రసాద్‌కు పరకాల నియోజకవర్గ బీజేపీ నాయకుల ఘన సత్కారం

**(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 28)**





ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా మెంబర్‌గా ఎన్నికైన ప్రముఖ సామాజిక వేత్త ముల్క ప్రసాద్‌ను పరకాల నియోజకవర్గ బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం గారు, ముల్క ప్రసాద్ గారికి శాలువా కప్పి ఘనంగా సత్కరించి తమ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. సమాజ సేవలో రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని, ముల్క ప్రసాద్ నియామకం ద్వారా వరంగల్ జిల్లాలో మరింత మందికి సేవలు చేరువవుతాయని నాయకులు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ బీజేపీ నాయకులు, మాజీ మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం, జిల్లా నాయకులు కొండి జితేందర్ రెడ్డి, ముత్యాల శ్రీనివాస్ గౌడ్, గురిజాల శ్రీరామ్‌రెడ్డి, ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి, ఎదులాపురం శ్రావణ్ కుమార్, చొక్కం శ్రీనివాస్, రాచెర్ల నరేష్, జాగిలపు రాంప్రసాద్, పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, బత్తుల సుమంత్, ప్రభాకర్, సతీష్, వెల్పుల రాజ్‌కుమార్, గాజుల నిరంజన్, గోపాల్, జాన్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

– ఇర్సడ్ల వంశీకృష్ణ, పవర్ దినపత్రిక, డిస్ట్రిక్ట్ స్టాఫ్ ప్రతినిధి

# 'తొలిముద్ద'తో అంగన్‌వాడీ చిన్నారులకు పోషక భరోసా.

- బాల్యంలోనే పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యవంతమైన భవిష్యత్తు.
- ఆటపాటలతో కూడిన విద్యతో అంగన్‌వాడీలపై నమ్మకం పెంచాలి.
- అంగన్‌వాడీలకు సొంత భవనాలు.. మౌలిక వసతుల కల్పనకు కార్యాచరణ.
- రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.



**ములుగు, పవర్:**

చిన్నారులకు బాల్యంలోనే సంపూర్ణ పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'తొలిముద్ద' కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలిముద్ద అల్పాహార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి సీతక్క'తొలిముద్ద' అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, మూడు నుంచి ఆరు సంవత్సరాల చిన్నారుల శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ వికాసానికి అవసరమైన పౌష్టికాహారాన్ని అందించడమే 'తొలిముద్ద' ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారికి అందించే మొదటి ఆహారాన్ని 'తొలిముద్ద'గా నామకరణం చేసినట్లు చెప్పారు.వెనుకబడిన జిల్లాల్లోని చిన్నారులకు మరింత మెరుగైన పోషకాహారం అందించాలనే లక్ష్యంతో ములుగు సహా ఎంపిక చేసిన ఆరు జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరు సంవత్సరాల చిన్నారులకు గుడ్డుతో పాటు ఒకరోజు ఉప్మా, మరోరోజు కిచిడీ రూపంలో పౌష్టిక అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. శారీరక ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషక విలువలు ఉండేలా అల్పాహారాన్ని రూపొందించినట్లు వివరించారు.ములుగు జిల్లాలో చిన్నారులకు ఇప్పటికే వంద మిల్లీలీటర్ల పాలను అందిస్తున్నామని, ఇకపై పాలు, గుడ్లు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం ద్వారా సంపూర్ణ పోషకాహారం లభిస్తుందని మంత్రి తెలిపారు. పోషకాహార లోపం ఉన్న చిన్నారులకు బాలామృతం, బాలామృతం ప్లస్ అందిస్తున్నామని చెప్పారు. పిల్లలు బరువు తగ్గకుండా, పోషకాహార లోపానికి గురికాకుండా ముందస్తుగా సంరక్షించేందుకు 'తొలిముద్ద' దోహదపడుతుందని పేర్కొన్నారు.

వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే చిన్నతనంలోనే పౌష్టికాహారం అందించి ఆరోగ్య సమస్యలను నివారించడం ఎంతో ముఖ్యమన్నారు. చిన్నారుల సంపూర్ణ వికాసానికి పౌష్టికాహారంతో పాటు ఆటపాటలు, పూర్వ ప్రాథమిక విద్య అవసరమని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో పాలు, గుడ్లు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఆట వస్తువులు, ఆకర్షణీయమైన ఏకరూప దుస్తులు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే ముందే పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో బలమైన పునాది వేయాలని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరిచి పిల్లలను కేంద్రాలకు పంపించేలా ప్రోత్సహించాలని సూచించారు.ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కనీసం 20 మంది చిన్నారులు ఉండేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రి ఆదేశించారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు మంచి పోషకాహారం అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దితే తల్లిదండ్రుల్లో అంగన్‌వాడీలపై మరింత నమ్మకం పెరుగుతుందన్నారు. పిల్లలతో నృత్యాలు చేయించడం, ఆటలాడించడం, పాటలు పాడించడం ద్వారా వారిలో ఆసక్తిని పెంచుతున్న అంగన్‌వాడీ టీచర్లను అభినందించారు.అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. సొంత భవనాలు లేని కేంద్రాలను గుర్తించి ఉపాధి హామీ పథకం ద్వారా భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మంజూరైన భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. కేంద్రాలకు బీరువాలు, బల్లలు, తాగునీరు సహా అవసరమైన మౌలిక వసతులను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా ఉన్నతీకరించామని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించామని తెలిపారు. ఖాళీలను గుర్తించి భర్తీ ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విధి నిర్వహణలో మరణిస్తే వారి కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను మరోసారి సమర్పించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పోషణ మాసంలో భాగంగా అధిక మాంసకృత్తులతో కూడిన ఆహారం తీసుకోవడం, హానికరమైన చిరుతిళ్లకు దూరంగా ఉండటంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు పౌష్టికాహారం అందేలా అంగన్‌వాడీ టీచర్లు బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఉత్తమ సేవలతో రాష్ట్ర, జాతీయస్థాయి పురస్కారాలు అందుకునేలా ముందుకు రావాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, చిన్నారులకు పౌష్టిక అల్పాహారం అందించే 'తొలిముద్ద' కార్యక్రమానికి ములుగు జిల్లా ఎంపిక కావడం సంతోషకరమన్నారు. బాల్యంలోనే పౌష్టికాహారం అందించడం ద్వారా భవిష్యత్తులో వచ్చే అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే ముందుగానే ఆరోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు 'తొలిముద్ద' అల్పాహార సామగ్రిని మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి అందజేశారు. బేటీ బచావో--బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. 'తొలిముద్ద' కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు మంత్రి, జిల్లా కలెక్టర్ స్వయంగా అల్పాహారం తినిపించారు.

ఐడీఓసీ ఆవరణలో పోషణ మాసాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వివిధ స్టాల్ లను మంత్రి, జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పౌష్టికాహార పదార్థాలు, తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్, ఆత్మ కమిటీ ప్రతినిధులు రఘు, రవీందర్ రెడ్డి, అరుణ, ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు కృష్ణవేణి, జిల్లా రెవెన్యూ అధికారి రవి కుమార్, జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, సీడీపీఓ శిరీష, స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# భగత్ సింగ్ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

**భగత్ సింగ్ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి**

**(హన్మకొండ -- పవర్, సెప్టెంబర్ 28)**

భారత స్వాతంత్ర్య సమరయోధుడు, అమరవీరుడు షహీద్ భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా హన్మకొండలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశం కోసం 23 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ త్యాగం ప్రతి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. 'ఇంక్విలాబ్ జిందాబాద్' అనే నినాదంతో బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన ధీరుడని, ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల చరిత్రను విస్మరించకూడదని, రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే అమరవీరులకు నిజమైన గౌరవం ఇస్తోందని అన్నారు. భగత్ సింగ్ కలలు కన్న అవినీతి రహిత, బలమైన భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు



---

# ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కలిసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన పాలకవర్గం



**(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 28)**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన పాలకవర్గ సభ్యులు వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు, రెడ్ క్రాస్ ప్యాట్రన్ నాయిని రాజేందర్ రెడ్డిని హనుమకొండ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. సమాజంలో ఆపదలో ఉన్న వారికి, పేదలు, నిరుపేదలు, రోగులు మరియు అవసరమైన వారికి రెడ్ క్రాస్ మరింత విస్తృతంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు. రక్తదానం, ఆరోగ్య సేవలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, థలసీమియా బాధితులకు సహాయం తదితర సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ఆయన సూచించారు. రెడ్ క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

రెడ్ క్రాస్ సొసైటీ పాలక వర్గం మాట్లాడుతూ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచనలు, సహకారంతో హనుమకొండ జిల్లాలో రెడ్ క్రాస్ సేవలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు బాశెట్టి హరిప్రసాద్, పుల్లూరి వేణుగోపాల్, బిల్లా రమణారెడ్డి, డాక్టర్ సి.హెచ్. సంధ్యారాణి, డాక్టర్ నల్ల సురేందర్ రెడ్డి, డాక్టర్ గొట్టిముక్కల శ్రీలక్ష్మి, ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, కొక్కిరాల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

---

# నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**రెడ్డి కాలనీలో రూ.50 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 28)**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయిస్తున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. 5వ డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతిరోజూ డివిజన్లలో పనులకు శంకుస్థాపనలు చేస్తూ, ప్రారంభించిన పనులకు కాంట్రాక్టర్లు మరియు అధికారులకు స్పష్టమైన టైం బాండ్ విధిస్తున్నామని తెలిపారు. నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశిస్తూ, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఏ డివిజన్‌లో ఎవరు ఉన్నారు, ఏ పార్టీకి చెందిన వారు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో సమానంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇప్పటివరకు చేపట్టిన రోడ్డు పనుల్లో 80 నుంచి 85 శాతం వరకు పూర్తయ్యాయని పేర్కొన్నారు.నగరంలో భారీ స్థాయిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కానున్న నేపథ్యంలో మిగిలిన రోడ్ల పనులను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కొత్త రోడ్లు వేసి, కొద్ది కాలానికే డ్రైనేజీ మరియు వాటర్ పైప్‌లైన్ల కోసం వాటిని మళ్లీ తవ్వాల్సిన పరిస్థితి రాకూడదన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో వరంగల్ నగరానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు వస్తున్నాయని, ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రెండు మూడు నెలల ఆలస్యాన్ని ప్రజలు అర్థం చేసుకుని సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులపై విమర్శలు చేసే వారు ముందుగా ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలతో విద్యార్థుల్లో ప్రతిభకు పదును

**హనుమకొండలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని**

(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 28)




హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ూ+ఖీ×) హనుమకొండ జిల్లా స్థాయి టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన ప్రోత్సాహం, అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. జిల్లా స్థాయి ఎంపికలు, పోటీల్లో భాగంగా వివిధ క్రీడాంశాల్లో సుమారు 2,000 మంది విద్యార్థి క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ ఆధారంగా ఎంపికైన క్రీడాకారులు తదుపరి స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం పొందనున్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి, భోజన వసతితో పాటు మంచినీటి సౌకర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ప్రశాంత్, హనుమకొండ ఎస్‌జీఎఫ్ఐ ఆర్గనైజింగ్ సెక్రటరీ వాసుదేవరావు, అండర్-19 ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీధర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎ. ప్రభాకర్ రెడ్డి, మల్యాల దేవేందర్, పెటా టీఎస్ సెక్రెటరీ కిషన్ నాయక్, దశ్రునాయక్, శ్యాం ప్రసాద్, టి. రాముడు, ఎస్. పార్థసారథి, మల్లారెడ్డి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు చోరీని సహించేది లేదు

**సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలో కాంగ్రెస్ భారీ నిరసన తెలిపిన ఎంపీ కడియం కావ్య**

(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 28)




ఓటర్ల జాబితా సవరణలో జరుగుతున్న అక్రమాలు, ఓటు చోరీకి వ్యతిరేకంగా ఏఐసీసీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీగా తరలివెళ్లాయి. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. 'ఓటు చోరీ'పై కాంగ్రెస్ పోరాటం ఇక్కడితో ఆగదని, ప్రజాస్వామ్యం మరియు రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రెండున్నరేళ్లుగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. బీజేపీ రాజకీయంగా వరంగల్‌లో అడుగుపెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను కాంగ్రెస్ కార్యకర్తలు సమష్టిగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో వరంగల్ అభివృద్ధికి బీజేపీ చేసిందేమీ లేదని, మామునూరు విమానాశ్రయం, ఓఆర్ఆర్, కోచ్ ఫ్యాక్టరీ వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో నిరంతరం పోరాడుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పెరుమండ్ల రామకృష్ణ , పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, డివిజన్, మండల అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటు హక్కుపై దాడిని సహించేది లేదు

**సీఈసీ తీరుపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన**

(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 28)




దేశ ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్రమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఓటర్ల జాబితాలో అక్రమ మార్పులు మరియు తొలగింపులపై సమగ్ర విచారణ జరిపించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఓటు చోరీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఏఐసీసీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.

హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియం నుంచి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తదితరులు నిరసన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే ప్రజల అత్యంత కీలకమైన ఆయుధమని, దానిని హరించే ఏ ప్రయత్నాన్నైనా కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘంలోని ఇతర కమిషనర్లు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మామునూరు విమానాశ్రయం, అభివృద్ధి కార్యక్రమాలపై బీజేపీ నేతలు కేవలం ప్రెస్‌మీట్లకు పరిమితమవుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వరంగల్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, దుద్దిళ్ల శ్రీను బాబు, ఇ.వి. శ్రీనివాస్ రావు, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ,ప్రజాప్రతినిధులు, డీసీసీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గడ్డి మందుపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పోరాటానికి ఫలితం

**పారాక్వాట్ డైక్లోరైడ్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం**

(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 28)



రైతులు మరియు గ్రామీణ ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు)పై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభ వేదికగా చేసిన పోరాటానికి కీలక ఫలితం లభించింది. పారాక్వాట్ వినియోగం వల్ల జరుగుతున్న ప్రమాదాలను వివరిస్తూ దేశవ్యాప్తంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ కావ్య మార్చి 27న లోక్‌సభ జీరో అవర్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోక్‌సభలో ఆమె గళమెత్తిన ఎనిమిది నెలల వ్యవధిలోనే కేంద్ర ప్రభుత్వం కీలక పరిణామం చోటుచేసుకుంది. తాజాగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సెప్టెంబర్ 22న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పారాక్వాట్ డైక్లోరైడ్‌కు కొత్తగా రిజిస్ట్రేషన్ ఇవ్వడాన్ని నిషేధించడంతోపాటు, ఇప్పటికే ఉన్న రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను రద్దు చేసినట్లు ప్రకటించింది. రిజిస్ట్రేషన్ కమిటీ ఆ సర్టిఫికెట్లను వెనక్కి తీసుకోవాలని, వాటిని తిరిగి ఇవ్వని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించింది. ఈ అంశాన్ని రాష్ట్రానికి పరిమితం చేయకుండా పార్లమెంట్‌లో జాతీయ సమస్యగా మార్చిన ఎంపీ కడియం కావ్య, పారాక్వాట్ వల్ల మానవ ఆరోగ్యం, పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని సభ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆత్మహత్యలకు ఈ రసాయనం సాధనంగా మారుతోందని, దీనికి నిర్దిష్ట విరుగుడు లేకపోవడం వల్ల ప్రాణనష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీ డిమాండ్ నేపథ్యంలో తెలంగాణ శాసనసభ సంపూర్ణ నిషేధం కోరుతూ తీర్మానం చేయగా, రాష్ట్ర ప్రభుత్వం కూడా తాత్కాలిక నిషేధం విధించింది. కేంద్రం తాజా తుది ఉత్తర్వులు జారీ చేయడంపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య హర్షం వ్యక్తం చేస్తూ కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాదకర రసాయనాల బారిన పడకుండా రైతులకు సురక్షితమైన ప్రత్యామ్నాయాలను అందుబాటులోకి తీసుకురావాలని, నిషేధ ఉత్తర్వుల అమలును పకడ్బందీగా పర్యవేక్షించాలని ఆమె కోరారు.

# ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలి

**పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**




(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 28)

దేశ ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్రమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఓటర్ల జాబితాలో అక్రమ మార్పులు మరియు తొలగింపులపై సమగ్ర విచారణ జరిపించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఓటు చోరీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఏఐసీసీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియం నుంచి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తదితరులు నిరసన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన పవిత్రమైన ఓటు హక్కును కాలరాసే కుట్రలను ప్రజలంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ పోరాటంలో ప్రతీ కార్యకర్త సైనికుడిలా భాగస్వామ్యం కావాలని కోరారు. ఎన్నికల వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న కేంద్ర తీరుపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో , టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, దుద్దిళ్ల శ్రీను బాబు, ఇ.వి. శ్రీనివాస్ రావు, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ,కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, డీసీసీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గూడూరు జయశ్రీకి ఏదైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత

### ప్రజా సంఘాలు, మహిళా సంఘాల నేతల హెచ్చరిక



(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 28)

హనుమకొండ నగరంలో అత్త మీరాబాయి చేతిలో ఇంట్లో బంధించబడి, వారం రోజులుగా పెట్రోల్ మరియు పురుగుమందు డబ్బాలతో నిరసన తెలుపుతున్న గూడూరు జయశ్రీకి ఏదైనా జరిగితే ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రజా సంఘాలు, మహిళా సంఘాల నేతలు స్పష్టం చేశారు. సోమవారం హనుమకొండలోని బాధితురాలు జయశ్రీ ఇంటి వద్దకు వెళ్లి ప్రజా సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి నలిగంటి రత్నమాల, ఏఐఎఫ్‌డీఎస్ అధ్యక్షురాలు మాస్ సావిత్రి, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు బొర్రా సంపూర్ణ, ఎంసీపీఐయూ రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగర్జున, సీపీఐయూఎస్ఐ వరంగల్ జిల్లా కార్యదర్శి గడ్డం శరత్, రజక సంఘం అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాద్దే మాట్లాడుతూ.. జయశ్రీని ఆమె అత్త మీరాబాయితో పాటు ఆడపడుచులు, వారి భర్తలు గత వారం రోజులుగా ఇంట్లోనే బంధించి బయటికి రానివ్వడం లేదని తెలిపారు. దీంతో మనస్తాపానికి గురైన జయశ్రీ ఇంట్లోనే పెట్రోల్, పురుగుమందు డబ్బాలను ముందు పెట్టుకుని "నాకు న్యాయం జరగకుంటే ఆత్మహత్య చేసుకుంటాను" అని హెచ్చరిస్తూ నిరసనకు దిగడం అత్యంత విషాదకరమన్నారు.

ఒక మహిళ తన ప్రాణాలకు తెగించి ఇలా నిరసన తెలుపుతున్నా, వారం రోజులుగా అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు. వెంటనే మీరాబాయిని అరెస్ట్ చేసి, జయశ్రీకి విముక్తి కల్పించాలని, ఆమెకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మహిళా కమిషన్, మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేయాలని కోరారు. జయశ్రీకి న్యాయం జరిగే వరకు ప్రజా సంఘాలు అండగా ఉండి పోరాటం చేస్తామని తేల్చి చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి దీప, అధ్యక్షురాలు ఎం. రమాదేవి, ఉపాధ్యక్షురాలు తార, ఎంసీపీఐయూ జిల్లా మహిళా నాయకురాళ్లు కనుక సంధ్య, మాలోతు ప్రత్యూష, జిడ్డీ రేణుక, వాసం కవిత, గుడిమె ఎల్లమ్మ, ఉప్పుల పద్మ, హనుమాండ్ల రమ, డీవీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు మేకల అనిత, వివిధ సంఘాల నాయకులు కేడల ప్రసాద్, చాపర్తి కుమార్ గాద్దే, మాదాసి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# జనగామ కలెక్టరేట్ ముట్టడి

### -- చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్



(జనగామ -- పవర్, సెప్టెంబర్ 28)

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ర ఝాన్సీ రాజేందర్ రెడ్డి పిలుపు మేరకు పాలకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున జనగామకు తరలివచ్చి కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో పాల్గొనారు. ముందుగా జనగామ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో సమావేశమయ్యారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరితో కలిసి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం జనగామ చౌరస్తా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నినాదాలు చేస్తూ ముందుకు సాగగా, కలెక్టర్ కార్యాలయం వద్ద చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

తదనంతరం జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ కు ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతీ లక్ష్మినారాయణతో కలిసి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో భాగంగానే జనగామ కలెక్టర్ కార్యాలయం ముట్టడి నిర్వహించామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, గ్రంథాలయ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఎంపీపీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలి..

### జనగామ కలెక్టరేట్ ముట్టడిలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి హెచ్చరిక




(జనగామ -- పవర్, సెప్టెంబర్ 28)

పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ర ఝాన్సీ రాజేందర్ రెడ్డి పిలుపు మేరకు పాలకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున జనగామకు తరలివచ్చి కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముందుగా జనగామ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో సమావేశమయ్యారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరితో కలిసి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం జనగామ చౌరస్తా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేస్తూ ముందుకు సాగగా, కలెక్టర్ కార్యాలయం వద్ద చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

తదనంతరం జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్‌కు ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతీ లక్ష్మినారాయణతో కలిసి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో భాగంగానే జనగామ కలెక్టర్ కార్యాలయం ముట్టడి నిర్వహించామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు, గ్రంథాలయ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఎంపీపీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# రెడ్‌క్రాస్ చైర్మన్‌గా విజయచందర్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నికపై బీజేపీ శ్రేణుల హర్షం

### శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి

(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 28)

హనుమకొండ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డిని బీజేపీ ఆత్మకూర్ మండల అధ్యక్షులు ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజ సేవ పట్ల అంకితభావంతో పనిచేసే డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డికి హనుమకొండ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు లభించడం అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం, రక్తదానం, ఆరోగ్య సేవలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, నిరుపేదలకు చేయూత వంటి మానవతా కార్యక్రమాల్లో రెడ్‌క్రాస్ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

ప్రజాసేవనే లక్ష్యంగా ముందుకు సాగుతున్న విజయచందర్ రెడ్డి నాయకత్వంలో హనుమకొండ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ మరింత సమర్థవంతంగా సేవా కార్యక్రమాలను విస్తరించి, అవసరంలో ఉన్న ప్రజలకు మరింత చేరువ అవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చైర్మన్‌గా ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, మాజీ మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం, రాచర్ల నరేష్, మందపెల్లి గోపాల్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# రెడ్‌క్రాస్ చైర్మన్‌గా విజయచందర్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నికపై బీజేపీ శ్రేణుల హర్షం

### శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం



(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 28)

హనుమకొండ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డిని బీజేపీ నాయకులు ఇర్సడ్ల సదానందం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజ సేవ పట్ల అంకితభావంతో పనిచేసే డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డికి హనుమకొండ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు లభించడం అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం, రక్తదానం, ఆరోగ్య సేవలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, నిరుపేదలకు చేయూత వంటి మానవతా కార్యక్రమాల్లో రెడ్‌క్రాస్ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

ప్రజాసేవనే లక్ష్యంగా ముందుకు సాగుతున్న విజయచందర్ రెడ్డి నాయకత్వంలో హనుమకొండ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ మరింత సమర్థవంతంగా సేవా కార్యక్రమాలను విస్తరించి, అవసరంలో ఉన్న ప్రజలకు మరింత చేరువ అవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చైర్మన్‌గా ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి, రాచర్ల నరేష్, మందపెల్లి గోపాల్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



## కీర్తి సురేష్ మూవీ బ్యాన్

### అడల్ట్ కంటెంట్ ఉండటంతో ప్రదర్శన నిలిపివేత

కార్తిక్ సుబ్బరాజ్ సినిమా అంటేనే అందులో ఊహించని ట్విస్టులు ఉంటాయని ఆడియన్స్ ముందే ఫిక్స్ అవుతారు. కానీ ఆయన లేటెస్ట్ మూవీ 'డోరతి' విషయంలో ఆ మలుపులే ఇప్పుడు సినిమాను మించి హాట్ టాపిక్‌గా మారాయి. చిన్ననాటి స్నేహితులు, జెండర్ ఐడెంటిటీ, కీర్తి సురేష్ క్యారెక్టర్.. అంటూ సోషల్ మీడియాలో ఈ సినిమా గురించి రకరకాల అభిప్రాయాలు ట్రెండ్ అవుతున్నాయి. బోల్డ్ ఎలిమెంట్స్‌తో వచ్చిన ఈ




సినిమా రిలీజ్‌కు ముందు నుంచే ఒక బజ్ క్రియేట్ చేస్తోంది. ఇండియాలో ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్ 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చింది. సినిమాలో అడల్ట్ డోస్ గట్టిగానే ఉందన్న సంగతి జనాలకు ముందే తెలుసు. కథ తీసుకున్న బోల్డ్ టర్న్ చూసి ఒక వర్గం ఆడియన్స్ షాక్ అవుతుంటే, ఇంకో వర్గం మాత్రం డైరెక్టర్ గట్స్‌ను మెచ్చుకుంటోంది. ఇండియాలో ఈ డివైడ్ టాక్ నడుస్తుండగానే, ఇప్పుడు ఓవర్సీస్ నుంచి వచ్చిన ఒక ఊహించని న్యూస్ డోరతి చుట్టూ కొత్త సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. మలేషియాలో డోరతి సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు అక్కడి సెన్సార్ అధికారులు బ్రేకులు వేశారు. స్క్రీనింగ్‌కు పర్మిషన్ ఇవ్వకపోవడంతో అక్కడ ప్లాన్ చేసిన రిలీజ్ మొత్తం ఆగిపోయింది. సినిమాలో ఉన్న ఎల్‌జీబీటీక్యూ రిలేషన్స్, మితిమీరిన బోల్డ్ సన్నివేశాలే ఈ నిషేధానికి ప్రధాన కారణమని ఇన్‌సైడ్ టాక్. అయితే కచ్చితంగా ఏ సీన్ల వల్ల అబ్జెక్షన్ వచ్చిందనే దానిపై మలేషియా అధికారులు అఫీషియల్‌గా ఎలాంటి క్లారిటీ ఇవ్వకుండా సైలెంట్‌గా బ్యాన్ చేశారు.



## కళాత్మక లుక్‌లో అలియా

### సంప్రదాయ కళల ప్రోత్సాహానికి చేయూత

అలియా భట్.. అందమైన చిరునవ్వుతోనే కాదు.. తన ఫ్యాషన్ ఎంపికలతోనూ ఎప్పుడూ ప్రత్యేకంగా నిలుస్తుంటారు. తాజాగా ఓ ఇంటిమేట్ పోర్ట్రెయిట్‌లో కనిపిస్తూ.. స్థానిక కళాకారుల ప్రతిభను, వారి అద్భుతమైన కళా వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. స్థానిక కళాకారులు ఎంతో నైపుణ్యంతో రూపొందించే హస్తకళలు, సంప్రదాయ కళలకు ప్రోత్సాహం అందించడంలో ప్రముఖ నటి షబానా ఆజ్మీ, ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా, మిజ్వాన్ ఇనిషియేటివ్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అలియా భట్ వారితో కలిసి కళాకారుల అద్భుతమైన పనితనాన్ని హైలైట్ చేశారు. సంప్రదాయ కళలకు ఆధునిక ఫ్యాషన్‌ను జోడిస్తూ రూపొందించిన ఈ లుక్‌లో అలియా ఆకట్టుకున్నారు. ఆమె పోజులు, డ్రెస్ డీటెయిల్స్ మాత్రమే కాకుండా.. ఆ వస్త్రం వెనుక ఉన్న కళాకారుల శ్రమను కూడా ఈ ఫొటోలు ప్రత్యేకంగా చూపిస్తున్నాయి. మిజ్వాన్ ఇనిషియేటివ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల కళాకారులకు, ముఖ్యంగా మహిళలకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. తరతరాలుగా వస్తున్న ఎంబ్రాయిడరీ, హస్తకళల సంప్రదాయాన్ని కాపాడుతూ.. దానికి కొత్త మార్కెట్‌ను అందించడమే ఈ కార్యక్రమాల ఉద్దేశం. అలియా భట్ ఈ ఫొటోషూట్ ద్వారా కేవలం ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇవ్వడం మాత్రమే కాకుండా.. తమ చేతివృత్తులతో అద్భుతమైన కళను సృష్టిస్తున్న స్థానిక కళాకారుల ప్రతిభను కూడా ముందుకు తీసుకొచ్చారు. సంప్రదాయం, కళ, ఆధునిక ఫ్యాషన్ కలయికగా నిలిచిన ఈ పోర్ట్రెయిట్ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.



## బీచ్ రోడ్డున గ్లామర్ షో

### హద్దులు దాటేస్తున్న కంచె బ్యూటీ

ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న పలువురు సినీ తారలు సమయం దొరికినప్పుడల్లా వెకేషన్‌కు వెళ్తూ రిలాక్స్ అవుతున్నారు. అక్కడి ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకుంటున్నారు. తాజాగా హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ కూడా తన స్నేహితులతో కలిసి వెకేషన్‌కు వెళ్లింది. ఈ సందర్భంగా ఆరెంజ్ కలర్ బికినీని తలపించే డ్రెస్‌లో బీచ్‌రోడ్డుపై సందడి చేసింది. గ్లామరస్ లుక్‌లో ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అవి వైరల్‌గా మారాయి. సినిమాల్లో హుందాగా, సంప్రదాయబద్ధంగా కనిపించే ప్రగ్యా.. సోషల్ మీడియాలో మాత్రం తన గ్లామర్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది.

## పౌజీ బ్యూటీ ఎక్కడ?

### ప్రభాస్‌తో నటిస్తున్నా అవకాశాలు కరువు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తోన్న పౌజీ సినిమాలో ఛాన్స్ అందుకుని ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది ఇమ్మాన్వీ ఇస్మాయిల్. డార్లింగ్ సరసన నటించాలని ఎంతో మంది ఫేమస్ బ్యూటీలు రేసులో ఉన్నా.. వాళ్లందర్నీ పక్కనబెట్టి మరీ దర్శకుడు హను రాఘవపూడి ఇమ్మాన్విని ఎంపిక చేశారు. అందుకు తగ్గట్టే అమ్మడు మంచి ట్యాలెంటెడ్. డాన్సింగ్ స్కిల్స్‌తో ఇప్పటికే లక్షల్లో ఫాలోవర్లను సంపాదించుకుంది. నటన పరంగా అమ్మడు ఎలాంటి పెర్ఫార్మర్ అన్నది పౌజీతో ప్రూవ్ అవ్వాలి. ఈ బ్యూటీ సినిమా ప్రారంభోత్సవ వేడుకలో మెరిసిన క్షణం నుంచి టాలీవుడ్ వ్యాప్తంగా పేరు మారుమోగిపోయింది. హను రాఘవపూడి కథానాయికలను వెండితెరపై ఎంత అందంగా, వైవిధ్యంగా చూపిస్తారో 'సీతారామం'తో నిరూపితమవ్వడంతో ఇమ్మాన్వీపై కూడా అంచనాలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. ఆమె పాత డ్యాన్స్ వీడియోలు, సోషల్ మీడియా రీల్స్ నెట్టింట విపరీతంగా ట్రెండ్ అయ్యాయి. టాలీవుడ్‌లోకి మరో స్టార్ హీరోయిన్ ఎంట్రీ ఇచ్చేసిందంటూ ట్రేడ్ వర్గాలు కూడా భావించాయి. అయితే ఆరంభంలో కనిపించిన ఆ హడావుడి ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదు. 'ఫౌజీ' అనౌన్స్‌మెంట్ తర్వాత ఇమ్మాన్వీ నుంచి ఎలాంటి పెద్ద చప్పుడు లేదు. కొత్తగా ఆమె వేరే ఏ తెలుగు ప్రాజెక్ట్‌కూ సైన్ చేసినట్లు ప్రచారం జరగకపోవడం.. అలాగే టాలీవుడ్ ఈవెంట్లలో గానీ, సర్కిల్స్‌లో గానీ అమ్మడి పేరు ఎక్కడా పెద్దగా వినిపించకపోవడంతో ఫౌజీ బ్యూటీ లైనప్ స్తబ్దుగా మారిందనే చర్చ మొదలైంది. సాధారణంగా ప్రభాస్ లాంటి గ్లోబల్ స్టార్ సరసన అవకాశం వస్తే ఇతర నిర్మాతలు, దర్శకులు ఆ కథానాయికతో సినిమాలు చేసేందుకు క్యూ కడుతుంటారు. ఆ క్రేజ్‌ను వాడుకుని వరుసగా ప్రాజెక్ట్‌లు దక్కించుకోవడం ఇండస్ట్రీలో సహజంగా జరిగే ప్రక్రియ. కానీ ఇమ్మాన్వీ మాత్రం అందుకు భిన్నంగా సైలెంట్‌గా మొదటి సినిమాపైనే పూర్తి దృష్టి పెట్టినట్లు కనిపిస్తోంది. టాలీవుడ్ గ్లామర్ ప్రపంచంలో ఈ రకమైన మౌనం విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తోంది.



## ఇషా రెబ్బా ఎథ్నిక్ ట్రీట్

### టైమ్‌లెస్ ఎథ్నిక్ లుక్‌లో కట్టిపడేస్తున్న భామ



తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన నటి ఇషా రెబ్బా మరోసారి తన అందంతో ఆకట్టుకుంటోంది. వెండితెరపై విభిన్న పాత్రల్లో కనిపిస్తూ నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈమె.. సోషల్ మీడియాలోనూ ఎప్పటికప్పుడు తన ఫొటోలను పంచుకుంటూ అభిమానులకు చేరువగా ఉంటోంది. తాజాగా ఇషా రెబ్బా సంప్రదాయ వస్త్రధారణలో మెరిసింది. ఎథ్నిక్ లుక్‌లో ఎంతో హుందాగా కనిపిస్తూ ఫొటోలకు పోజులిచ్చింది. సహజమైన అందానికి తగినట్టుగా సింపుల్ మేకప్, ఆకట్టుకునే ఆభరణాలతో ఆమె లుక్ ప్రత్యేకంగా నిలిచింది. సంప్రదాయ దుస్తుల్లోనూ తన స్టైల్‌ను చాటుకుంటూ ఫొటోషూట్‌లో సందడి చేసింది. ఇషా రెబ్బా సినీ ప్రయాణంలో విభిన్న కథలు, పాత్రలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోంది. నటనతో పాటు తన ఫ్యాషన్ సెన్స్‌తోనూ అభిమానులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా సంప్రదాయ దుస్తుల్లో ఆమె కనిపించే తీరు సోషల్ మీడియా ప్రేక్షకులను ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది. తాజా ఫొటోల్లో ఇషా రెబ్బా చూపించిన హుందాతనం, సంప్రదాయ అందాలు అభిమానుల ప్రశంసలు అందుకుంటున్నాయి. ఫొటోలను చూసిన నెటిజన్లు ఆమె లుక్‌పై కామెంట్లు చేస్తున్నారు. దీంతో ఈ ఫొటో గ్యాలరీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



## పూల సుగంధాల మధ్య అనుపమ

### అభిమానులను ఆకట్టుకుంటున్న మలయాళీ కుట్టి

'ప్రేమమ్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన నటి అనుపమ పరమేశ్వరన్ తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. వరుస సినిమాలతో బిజీగా ఉంటూనే సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో తన వ్యక్తిగత, సినీ విశేషాలను పంచుకుంటోంది. తాజాగా అనుపమ పరమేశ్వరన్ పూల సుగంధాల మధ్య అందమైన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. రంగురంగుల పూల మధ్య ప్రశాంతమైన వాతావరణంలో కనిపిస్తూ కెమెరాకు పోజులిచ్చింది. సహజమైన చిరునవ్వుతో కనిపించిన ఆమె ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. సింపుల్ లుక్‌లోనూ తన అందాన్ని మరింత ప్రత్యేకంగా చూపించిన అనుపమ.. ఫొటోల్లో ఎంతో ఫ్రెష్‌గా కనిపించింది. పూల అందాలకు అనుపమ అందం తోడవడంతో ఫొటోలు మరింత ఆకర్షణీయంగా మారాయి. తాజా ఫొటోలను చూసిన అభిమానులు, నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. దీంతో అనుపమ షేర్ చేసిన ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.